




మదర్ థెరిస్సాకు ఘన నివాళులు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ప్రైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు రహీం మాట్లాడుతూ భారతరత్న మదర్ థెరిస్సా ప్రపంచ కరుణామూర్తి అన్నారు. పేద ప్రజలకు ప్రేమ తత్వాన్ని అందించిన త్యాగశీలి అన్నారు. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని చాటిచెప్పిన గొప్ప మహిళామణి అన్నారు. 18 సంవత్సరాల వయసులోనే ఇల్లు వదిలి సిస్టర్స్ ఆఫ్ చారిటీ అనే ప్రచారక సంఘంలో చేరి అనేక సేవలను అందించడం జరిగిందని తెలిపారు. అటువంటి కరుణామూర్తి ప్రపంచంలోనే అరుదు అని తెలిపారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నయీమ్ బాషా, కరిముల్లా, బషీర్, రసూల్, డాక్టర్ రాయ్, మస్తాన్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇంకా ఇసుక ప్రియమే..?

రాష్ట్ర ప్రభుత్వ నూతన ఇసుక విధానం జిల్లా ప్రజలకు కాస్త ఊరట కలిగిస్తున్నా, ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఇసుక దొరకడం లేదు. ఇసుక విధానం వచ్చినా అనేక బాలారిష్టాలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం కన్నా కొంత ఉపయోగమేనంటూ వినియోగదారులు సంతోషపడుతున్నారు.. జిల్లాలో రీచ్‌లు అందుబాటులో లేవు. గతంలో జిల్లా వ్యాప్తంగా మూడు రీచ్‌లు అందుబాటులో ఉండగా, ఇప్పుడు కేవలం మర్రిపాడు రీచ్‌లో మాత్రమే ఇసుక లభిస్తోంది. ఒక్క మెట్రిక్ టన్ను రూ. 370 ప్రభుత్వం నిర్ణయించింది. రవాణా ఛార్జీలు అధికారికంగా ప్రకటించింది. ప్రతి రోజూ అతి తక్కువ మాత్రమే ఇసుక ఇస్తుండడంతో భవన నిర్మాణ యజమానులు లబోదిబో అంటున్నారు. పనులు నిలిచిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ ఒకటి నాటికి స్పష్టమైన ఆదేశాలు ఇస్తుందని తెలుస్తోంది.



ప్రొక్లెయిన్‌తో ఇసుక తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

- ◆వినియోగదారులు లబోదిబో
- ◆ఒక్క రీచ్‌లోనే లభ్యం
- ◆టన్ను రూ.370, భారీగా రవాణా ఛార్జీలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ జిల్లాలోని వినియోగదారుల కొంత ఉపయోగకరంగా ఉందని సంబరపడుతున్నా ఇసుక ఇప్పటికీ ప్రియంగానే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 8 వతేదీ నూతన ఇసుక పాలసీ ప్రకటించింది. గతం కంటే కొంత ధరలు తగ్గాయి. ఆశించిన స్థాయిలో ఇసుక వినియోగదారులకు దొరకడం లేదు. . 2014-19 వరకు ఎనిమిది ఇసుక రీచ్‌లుండేవి. అక్కడ నుంచి ఉచితంగా వినియోగదారులు ఇసుక తీసుకెళ్లే పరిస్థితులుండేవి. అప్పట్లోనూ కొందరు అక్రమార్కులు రాత్రికి రాత్రే బెంగుళూరు, చెన్నైకు తరలించే పరిస్థితులో స్వయంగా కలెక్టర్ జాతీయ రహదారులపై నిఘా పెట్టిన సందర్భాలున్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు సైతం రాత్రి, పగలు ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయి. అయినప్పటికీ కొందరు బడా వ్యాపారవేత్తలు భారీగా డంపింగ్ చేసుకున్న సందర్భాలున్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఇసుకను ప్రియం చేసిన విషయం తెలిసిందే. భారీగా ధరలు పెంచారు. స్టాక్ పాయింట్స్ పెట్టి అక్కడ నుంచి వినియోగదారులు కొనుగోలు చేసేలా చేశారు. మినగల్లు, వెంకటాచలం, పల్లిపాడు, మర్రిపాడు, కావలిలో స్టాక్ పాయింట్స్ పెట్టి అమ్మకాలు చేశారు. ఇసుక విధానమే ఆపార్టీకి కొంత నష్టం తెచ్చిపెట్టింది. నెల్లూరు నగరంలో ఒక ట్రాక్టర్ ఇసుక రూ. 5 వేలు, టిప్పర్ ఇసుక రూ.18 వేల వరకు పలికింది. అనేక మంది భవనాల నిర్మించడానికి ముందుకు రాకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు, ఆ రంగంపై ఆధారపడి జీవించే ఎందరికో పనిలేకుండా పోయింది. ప్రతి నెలా కోట్లాది రూపాయలు నష్టం వచ్చింది. ఈ పద్ధతి ఎప్పుడు పోతుందా అని అనేక మంది ప్రజలు ఎదురుచూశారు. నూతన ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం కొత్త మేర ఉపయోగమే. పూర్తి ఉచితం కాకపోయినా కొంత మేర సబ్సిడీ వస్తుంది. గత నెల 8 వతేదీ వరకు ప్రభుత్వం జిల్లాలో మూడు స్టాక్ పాయింట్స్ పెట్టింది. మినగల్లు, మర్రిపాడు, పల్లిపాడుల్లో ఏర్పాటు చేసింది. గతంలో రోజుకు ఒక వ్యక్తి 20 టన్నులు వరకు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. వైసిపి ప్రభుత్వంలో మర్రిపాడు స్టాక్ పాయింట్ నుంచి టన్ను రూ.723, మినగల్లు రూ.650, పల్లిపాడు రూ.650 ఉండే దానిని రూ.370కి ప్రస్తుత ప్రభుత్వం తగ్గించింది. ఇంత వరకు బాగున్నా ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.

ఇంకా ఇసుక ప్రియమే..!

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక విధానంలో మార్పు తీసుకొచ్చినా పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రస్తుతం మర్రిపాడు రీచ్ నుంచి మాత్రమే సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ 'పే' బిల్లు, టైం స్లాట్ ఆధారంగా సరఫరా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. టన్ను రూ.370 ధర నిర్ణయించారు. రవాణా ఛార్జీలను మైనింగ్ అధికారులు నిర్ణయించారు. టిప్పర్ రూ.1500 నుంచి రూ.8500 వరకు ట్రాన్స్‌పోర్టు ధర ఉంది. టన్ను రూ.370 చొప్పున రూ.7400 అవుతోంది. టిప్పర్ ఇసుక మర్రిపాడు నుంచి రూ.16వేలు అవుతోంది. అనధికారంగా కొందరు వ్యక్తులు టిప్పర్ రూ.40 వేలకు అమ్మకాలు చేస్తున్నారు. మర్రిపాడు చుట్టుపక్కల వారికి కొంత ఉపయోగంగా ఉన్నప్పటికీ నెల్లూరుకు రావాలంటే భారీగా ధర పలుకుతోంది. దీంతో కొందరు టిడిపి నేతల చుట్టూ తిరుగుతున్నారు. సెప్టెంబర్ ఒకటిన నూతన ఇసుక విధానం వస్తుందని ఆశిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకుండే వినియోగదారులకు ఇబ్బందులు తప్పవు.

మైనింగ్ శాఖ కార్యాలయంలో ఎసిబి దాడులు

ప్రజాశక్తి-నెల్లూరు: నెల్లూరు నగరంలో మైనింగ్ శాఖ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జిల్లాలో భారీగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు చోటు చేసుకున్నాయని, ఈ అక్రమ వ్యవహారం మైనింగ్ శాఖ అధికారులకు తెలిసినా తెలియ నట్లు వ్యవహరించారన్న ఆరోపణలు వెలువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎసిబి అధికారులు సోమవారం మైనింగ్ శాఖ కార్యాలయంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎసిబి అధికారులు పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారని తెలుస్తుంది. ఎవరినీ కార్యాలయంలోనికి రానివ్వకుండా ఏసిబి అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఎసిబి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించడం వల్ల మైనింగ్ శాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాపునాడు సేవా సమితి పట్టణ అధ్యక్షులుగా 'దారం'

ప్రజాశక్తి-కందుకూరు: రాష్ట్ర కాపునాడు సేవా సమితి కందుకూరు పట్టణ అధ్యక్షులుగా దారం రాఘవేంద్రను నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి జాతీయ అధ్యక్షులు మల్లెల శివ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నియామక పత్రాన్ని ఆయన దారం రాఘవేంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు పట్టణ , ప్రకాశం జిల్లాలోని కాపు కులస్తులకు సహాయ సహకారాలు అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కాపు కులస్తులను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవాసమితి కందుకూరు పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన దారం రాఘవేంద్రకు శెట్టి కొండయ్య , గోకరాజు హరికృష్ణ, ఏకాంబరం విశ్వనాథ్, దారం మహేష్ శుభాకాంక్షలు తెలియజేశారు.



కొన్న ప్రతి వస్తువుకూ బిల్లులు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు : దుకాణాల్లో ప్రజలు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ తప్పకుండా బిల్లులు తీసుకోవాలని సెంట్రల్ జిఎస్‌టి ఎపి కమిషనర్ (ఆడిటింగ్ వింగ్) పి.ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్స్ ఆడిట్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన కమిషనర్ చాంబర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ పాత్రికేయులతో మాట్లాడారు. తాను ఆడిటింగ్ వింగ్ కమిషనర్‌గా ఆగస్టు 12న బాధ్యతలు చేపట్టానని, క్షేత్రస్థాయిలో పర్యటించి రాష్ట్రంలో తమ ఆడిటింగ్ వింగ్ బలోపేతానికి చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో కాకినాడ, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో సెంట్రల్ జిఎస్‌టి ఆడిటింగ్ వింగ్ కార్యాలయాలుండగా త్వరలో అనంతపురం, కర్నూలులో కార్యాలయాల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తమ పరిధిలోని అన్ని సంస్థల్లో ఆడిటింగ్ తనిఖీలు చేస్తున్నామని, ఈ ఏడాది ఇంకా 500పైగా సంస్థల్లో జిఎస్‌టి ఆడిటింగ్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. పన్నులు ఎగవేసినా, తప్పుడు లెక్కలతో పన్నులు తక్కువ చెల్లించినట్లు తమ ఆడిటింగ్‌లో తేలితే ఎవరిని ఉపేక్షించమని, ప్రజల నుంచి పన్నులు వసూలు చేసిన వ్యాపారులు తప్పకుండా ప్రభుత్వాలకు చెల్లించాల్సిందేనని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఒకేవిధమైన గూడ్స్ అండ్ సర్వీసు ట్యాక్స్ (జిఎస్‌టి) విధానాన్ని 2017లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జిఎస్‌టి విధానం రాకముందు కేవలం 70లక్షలు మాత్రమే పన్ను చెల్లింపుదారులు దేశంలో ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపు అనగా 1.40 కోట్లలకు చేరడం ఈ విధానం ద్వారా సాధించిన ఫలితంగా చెప్పారు. వ్యాపారాలందరూ ఈ విధానం ద్వారా సకాలంలో కచ్చితమైన పన్నులు చెల్లిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం వల్ల వివిధ వస్తువులు సేవలపె జిఎస్‌టి రేట్లు తగ్గాయన్నారు. అంతే కాని, అందరూ అనుకున్నట్లు జిఎస్‌టి వసూళ్లు తగ్గలేదన్నారు. కార్యక్రమంలో నెల్లూరు ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్. ఉషాకిరణ్, నెల్లూరు ఆడిట్ సర్కిల్ సూపరింటెండెంట్లు మల్లెల శ్రీనివాసరావు, ఎన్.జ్ఞానేంద్ర కుమార్, ఎన్. మార్కెండేయ తదితర సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

కందుకూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు

ఈ నెల 22,23,24 , 25 తేదీలలో విజయవాడ లోని చెన్నపాటి రామ కోటయ్య ఇన్ డోర్ స్టేడియం లో జరిగిన ఐటిఎఫ్‌యు ఆసియన్ ఛాంపియన్ షిప్ లో మాస్టర్ హఫీజ్ ఆధ్వర్యంలో కందుకూరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. పోటీలలో కందుకూరు నుంచి 5 మంది పాల్గొనగా వారిలో ఇద్దరు బంగారు పతకాలు, ఇద్దరు వెండి పతకాలు, ఒక రజత పతకం సాధించారు. బైనీడి బాల మురళి కృష్ణ బంగారు పతకం, డి. వి. ఎం. సంజయ్ ఆదిత్ బంగారు పతకాలు, కె. లక్ష్మి నారాయణ , ఏ. జగన్ వెండి పతకాలు, ఏ. మౌనిక రజత పతకం సాధించారు. విజేతలకి ఐటిఎఫ్‌యు ఇండియన్ గ్రాండ్ మాస్టర్ బి వి. రమణయ్య, కందుకూరు నియోజక వర్గ శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వర రావు ,పట్టణ ప్రముఖులు పిడికిటి వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు డాక్టర్. జహంగీర్ అభినందనలు తెలిపారు.






సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నగరంలో రౌడీ షీటర్ దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు

బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పలు కేసుల్లో నిందితుడు, రౌడీ షీటర్ గుంజి రవి (అలియాస్ కత్తి రవి) (40) ని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో విచక్షణా రహితంగా దాడిచేసి హత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కత్తి రవి హత్యకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం తెల్లవారు జామున 4 నుంచి 5 గంటల సమయంలో ఈ హత్య జరిగిందని భావిస్తున్నారు. హతుడు వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో ఓ హత్య కేసులో నిందితుడని పోలీసులు పేర్కొన్నారు. జనశక్తి నగర్ ప్రాంతానికి చెందిన గుంజి రవి (అలియాస్ కత్తి రవి) తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నాడు. ఈ ఘటనపై బాలాజీనగర్ సిఐ సాంబశివరావు తన బృందంతో కలిసి పలు కోణాల్లో విచారణ చేపట్టడంతోపాటు ఘటనా స్థలం వద్ద సిసి కెమెరా పుటేజీని సేకరించారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన చింటూ, నిప్పోసాయి, వెంకటరమణ అను స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి ఓ పంక్షన్‌కు హాజరై మద్యం సేవిస్తూ రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి సమయంలో తిరిగినట్లు గుర్తించారు. మద్యం మత్తులో ఒకరిని మరొకరు దూషించుకుంటూ ఘర్షణ వాతావరణం ఏర్పడటం , ఒక్క సారిగా గుంజి రవిపై మిగిలిన వారు కత్తులతో దాడికి పాల్పడినట్లు పోలీసుల గుర్తించారు. మృతుడు ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడని, ఇటీవల కాలంలో రిమాండ్ నుంచి బెయిల్‌పై బయటకు వచ్చినట్లు తెలుస్తుంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని జిజిహెచ్‌కి తరలించారు.



మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్

నేడు వక్ఫ్ చట్ట సవరణలకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు: ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన చట్ట సవరణలకు వ్యతిరేకంగా నేడు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆవాజ్ జిల్లా కమిటీ ప్రకటించింది. సోమవారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో ఆవాజ్ జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రఫీ, షేక్ రషీద్‌లు మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ ఆవాజ్ జిల్లా కమిటీ నిర్వహిస్తున్న గాంధీ బొమ్మ నుంచే కలెక్టరేట్ వరకు జరుగు ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయడం వల్ల వక్ఫ్ చట్టానికి తూట్లు పొడిచేటట్టు ఉన్నదన్నారు. వక్ఫ్ బోర్డుని ఇప్పటి దాక పాలించిన ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు వక్ఫ్ భూములను నిర్వీర్యం చేశారని వాటిని కాపాడమని చెప్పిన సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా సిఫార్సులను పక్కనపెట్టి మైనారిటీల అభివృద్ధికి సహకరించకపోగా చట్టసవరణ ల పేరుతో నష్టం చేస్తున్నారన్నారు. దేశంలోనే అతిపెద్ద మూడో సంస్థ అయినప్పటికీ మైనారిటీలు నామమాత్రపు బతుకులు బతుకుతున్నారని ఆ బతుకులు బాగు పరిచేందుకు వక్ఫ్ భూముల ఆదాయాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో కూడా 1200 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని వాటాని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం అక్రమాల చరనుంచి విడిపించి మైనారిటీల అభివద్ధి కొరకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌ను కలిసి చట్ట సవరణల వల్ల కలిగే నష్టాన్ని వివరించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న మసీదు, మకాన్, ఈద్గా కమిటీలు, ముస్లిం మైనారిటీలు, ప్రజాసంఘాలు అందరూ పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ చాన్ బాషా, షేక్ ఫయాజ్, సభ్యులు హుమయూన్‌లు పాల్గొన్నారు.

'కాకాణి'పై కేసు నమోదు..!

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని బిజెపి నేత చేసిన అవినీతి ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆది, శనివారాల్లో వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిని 2 పేరు కింద చేర్చారు. పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడం లేదని వైసిపి నేతలు ఆరోపించారు. గతంలో పలు సార్లు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నియోజకవర్గంలో కేసులు నమోదయ్యాయి..

కేసులకు భయపడను-కాకాణి


సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి ఎన్ని తప్పడు కేసులు పెట్టినా భయపడనని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆపార్టీ జిల్లా కార్యాయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ దళితుడిని డబ్బు కోసం డిమాండ్ చేశారని, అది ప్రెస్‌మీట్ పెడితే అతనిపై, దానిని సోషల్‌మీడియాలో పోస్టు పెట్టానని తనపై కేసులు నమోదు చేశారన్నారు ఇలాంటి బెదిరింపులకు భయపడనన్నారు. వందరోజుల్లో సోమిరెడ్డి అవినీతిని ఆధారాలతో సహ విడుదల చేస్తానన్నారు. రాష్ట్రంలోనే సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు ఎక్కువగా సాగుతున్నాయని, దీనిని ఎప్పటికప్పుడు ఎండకడుతానన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు టిఆర్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆవరణంలో జిల్లాస్థాయి తైక్వాండో సీనియర్ బాల బాలికల ఎంపిక సోమవారం జరిగింది. ఖేలో ఇండియా పోటీలకు సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని తైక్వాండో జిల్లా కార్యదర్శి మాస్టర్ ఎస్కే అబ్దుల్ సలాం తెలిపారు.ఇందులో బంగారు పతకం సాధించినటువంటి క్రీడాకారులు ఈనెల 31వ తేదీ , సెప్టెంబర్ 1 తేదీలలో తిరుపతిలోని సాంస్క్రిట్ సెంట్రల్ యూనివర్సిటీలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. చీరాలకి చెందిన వినీత, పి భాను రేఖ,.శివ నాగ సాయి ప్రియ, కందుకూరుకి చెందిన ఎస్కే మసూద్ ,ఎస్కే షాహీద్ క్రీడాకారులు ఎంపికైనారు.ఈ పథకాలు సాధించిన క్రీడాకారులను,కోచ్ ఎస్ డి.సలావుద్దీన్ ,పి అఖిల్,జే ముఖేష్ కుమార్,పి ప్రశాంత్ బాబులను జిల్లా అధ్యక్షులు ఉన్నం వీరస్వామి గారు మరియు కార్యదర్శి మాస్టర్ ఎస్ కె అబ్దుల్ సలాం అభినందించారు.

కృష్ణపట్నం పోర్టులో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : అదాని కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ భవనంలో సోమవారం కృష్ణాష్టమి వే డుకలు అత్యంత ఘనంగా జరిగాయి. కృష్ణాష్టమి సందర్భంగా పోర్టు పరిపాలన భవనంలో అదాని కృష్ణపట్నం పోర్టు సిఇఒ జిజె రావు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూ జలు నిర్వహించారు. పోర్టు పరిపాలన భవనంలోని ఉద్యోగులందరూ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. పోర్టు కార్మికుల ఉద్యోగులందరూ ఆయురారోగ్యాలతో సుఖ: సంతో షాలతో నిండు నూరేళ్ళ జీవించాలంటూ ఆకాంక్షించారు.కృష్ణాష్టమి ప్రత్యేక పూజలు అనం తరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ , ఫైనాన్సర్ గుడివాడ శ్రీకాంత్, మృత్యుంజయ రామ్ రమేష్ బాబు, వెంక టేష్ భాస్కరన్, పుచ్చలపల్లి శ్రీనివాసులు, రాజేష్ యాదవ్, పోర్ట్ లోని వివిధ విభాగాలు హెచ్‌ఒడిలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పోర్టులో కృష్ణాష్టమి పూజలు చేస్తున్న దృశ్యం

యాష్‌పాండ్ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు ముసునూరు వారి పాలెంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో యాష్ పాండు కట్ట తెగి నష్టపోయిన రైతులకి ఎకరాకి రూ.3 లక్షలు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికీ 25 వేల రూపాయలు పరిహారం ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ముసునూరు వారి పాలెం లోని హైస్కూల్ ఆవరణలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సిఐటి యు ఇండస్ట్రియల్ క్లస్టర్ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌షా, రైతు సంఘం మండల కార్యదర్శి బ్రహ్మాదేవి మోహన్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఎనెల్లూరు సుధాకర్, రైతు సంఘం నాయకులు గోల పోలురాజు పాల్గొన్నారు.





ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని ఆమని గార్డెన్స్ లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నేత నూనె మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ఆమని గార్డెన్స్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కృష్ణుని విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా నూనె మల్లికార్జున తో మాటాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేత గునుకుల కిషోర్, మాజీ కార్పొరేటర్ విటపు లలితా రామ్, లాయర్ శ్రీరామ్, నాగిశెట్టి మురళీకృష్ణ, పవన్, రమణ, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వెంకటాచలం: కృష్ణ మందిరం లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత రాధా కృష్ణుల విగ్రహాలకు నిర్వహించిన అభిషేకాలు చూసి భక్తులు తరించారు. అనంతరం భక్తులు రాధా కృష్ణుల ఉత్సవ విగ్రహాలకు తామే స్వయంగా అభిషేకాలు చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మనోజ్ కుమార్ గుప్తా ,చల్లా రమణయ్య, మంది పాటి రమేష్ బాబు, వర్ధగల్లు హరిబాబు, గజ్జల శంకరమ్మ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాలలో ప్రజలు దేవాలయాలకు వెళ్లి ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలకు గోపిక రాధా వేషధారణ వేసి ఎంతో మురిసిపోయారు. శ్రీకృష్ణ భక్తులు ఎంత ఉత్సాహంతో కేరింతల కొడుతూ కృష్ణుని పాటలు పెట్టుకొని డాన్సులు వేశారు.

ప్రజాశక్తి-జలదంకి : జలదంకిలోని శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ బత్తిన అయ్యల రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అయ్యలరెడ్డి మాట్లాడారు. విద్యతో పాటు మానసిక ఉల్లాసాన్ని, ఒత్తిడి లేని అనుకరణతో కూడిన విద్యను అందించేందుకు చర్యలు ఎప్పుడూ అయ్యల రెడ్డి విద్యా ప్రణాళికలో పొందుపరచబడి ఉంటా యన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ, మోటివేషన్ ఇస్తూ విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు. చుక్కానిలా ముందు చూపుతో విద్యను అందించడంలో అయ్యలరెడ్డికి సాటి లేరనడంలో ఆశ్చర్యం లేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని గువ్వడి గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన భక్తులకు స్వామి తీర్థ, అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.చిన్నారులను కృష్ణుడు వేసాధారణలో చూసి తల్లిదండ్రులు మురిసి పోయారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కృష్ణాపురం, కంప సముద్రం గ్రామాలలోని దేవాలయాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. దేవాలయాన్ని పూల తోరణాలతో, విద్యుత్తు అలంకరణ చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణునికి పాలాభిషేకం, పంచామృతంతో అభిషేకం కొబ్బరికాయలు కొట్టి ప్రసాదాలు నైవేద్యాలు సమర్పించారు. బేరి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అల్లంపాటి సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలో ఎపిటిఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా యూనిఫైడ్ పెన్షన్ విధానం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఉద్యోగుల ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్ని ఏమి చేస్తారనేది వివరణ లేదన్నారు. ఉద్యోగులు కేవలం ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని పాతపెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని కోరుకుంటున్నారన్నారు. ఎటువంటి షరతులు లేనటువంటి ఒపిఎస్ విధానం అమలు చేయాలని ఉద్యోగుల, ఉపాధ్యాయుల పక్షాన ప్రభుత్వాన్ని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పనిసర్దుబాటు విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలన్నింటిని పరిష్కరించిన అనంతరం పనిసర్దుబాటు అమలు చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులందరినీ ఒక యూనిట్‌గా పరిగణించి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర బాధ్యులు ఎస్‌డి జుల్ఫికర్ ఆలీ అహ్మద్ మాట్లాడుతూ అక్టోబరు 6,7,8 తేదీలలో విజయనగరంలో నిర్వహించే ఏపిటిఎఫ్ 80 సంవత్సరాల వేడుకలు, విద్యా వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు ఎన్.మురళీకృష్ణ, ఎస్‌కె. కరీం మొహిద్దీన్, బి.తిరుపతిరెడ్డి, బాలత్రి పురసుందరి, విజయభారతి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు ఆర్.రామసుబ్బారెడ్డి, చల్లా .శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

భూ బాధితుల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

ఈనెల 28వ తేదీ విజయవాడలో జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును బాధితులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిస్తూ అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఆవిష్కరించారు. సోమవారం సంతపేట ప్రాంతంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో అధికారం అడ్డుపెట్టుకొని అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్పొరేటర్లు వివిధ స్థాయిలో ఉన్నటువంటి వైసిపి నాయకులు పేదవాడు భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారన్నారు. అదేవిధంగా చిత్తూరు జిల్లాలో వేలాది ఎకరాల భూమిని కాజేశారన్నారు. ఈ అక్రమానికి సంబంధించిన సమాచారం ఎక్కడ బహిర్గతం అవుతుందో అన్న భయందోళనతో ఫైళ్లను సైతం దగ్ధం చేసి అగ్నికి ఆహుతి చేశారన్నారు. అదేవిధంగా అగ్రిగోల్డ్ సంబంధించిన భూములు కూడా కాజేసి ఆ ఫైళ్లను సైతం దగ్దం చేశారన్నారు. ఇలా అనేక భూ అక్రమాలకు పాల్పడ్డారని, వీటన్నింటి పైన ఎవరైతే భూ బాధితులు ఉన్నారు వారు ఈనెల 28వ తేదీ విజయవాడ లోని దాసరిభవన్ కు చేరుకొని తమ సమస్యలు తెలియజేయాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఈ భూ బాధితులకు వాళ్ల భూములు ఇప్పించి తగు న్యాయం చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షాన్‌వాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నంది పోగు రమణయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్జున్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విడవలూరు: కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఊటుకూరు గ్రామం టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి గెలుపునకు అర్జున్ రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు డిఎస్‌సి ద్వారా వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధిని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం


ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఓ రోడ్డు ప్రమాదంలో తమ మిత్రుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, పరిస్థితి తీవ్రంగా ఉందని, అతని మిత్రుల అభ్యర్ధన మేరకు డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్టు అధినేత, ఎస్‌విపి ప్రజావైద్యశాల ఎమ్‌డి డాక్టర్ ప్రణీత్ ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని అశ్వినీపురం సమీపంలో ఆదివారం రాత్రి ఓ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పట్టణానికి చెందిన షేక్ ఇబ్రహీం తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని డాక్టర్ ప్రణీత్ దృష్టికి అతని స్నేహితులు తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. తమ మెమోరియల్ ట్రస్టు తరపున రూ.10వేల చెక్కును మిత్రులకు అందచేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మిత్రునికి ఏమీకాదని, మీరు ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. తమ మిత్రుడి కోసం ఆర్థిక సహకారాన్ని అందజేసిన డాక్టర్ ప్రణీత్ దాతృత్వాన్ని మిత్రబృందం కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తొడేటి.అశోక్ ఉన్నారు.


కావలి ఏరియా ఆస్పత్రిలో...

మదర్ థెరిస్సాకు ఘన నివాళులు

ప్రజాశక్తి-కావలి

మదర్ థెరిస్సా 114వ జయంతి సందర్భంగా మదర్ థెరిస్సా సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం కావలి ఏరియా హాస్పిటల్లో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు, పాలు, దుప్పట్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవాసమితి కావలి అధ్యక్షులు మన్నేపల్లి రమేష్, దగ్గుమాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కావలి : బిసి ఐక్యత భవన్ ఆధ్వర్యంలో బిసి ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్, గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాదరావు, లాయర్ సాయి ప్రసాద్, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, వెంకటేష్ తదితరులు నోబెల్ శాంతి గ్రహీత, భారతరత్న మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాదరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కావలి : కావలి డివిజన్ పిఎంపి అసోసియేషన్, గౌరవ అధ్యక్షులు, విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి షేక్.బాషా ఆధ్వర్యంలో కావలి బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ బిసి కళాశాల బాలికల వసతి గృహం, ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహాల సముదాయంలో హాస్టల్ విద్యార్థినుల మధ్య, మొదటిగ మదర్ థెరిస్సా చిత్రపటానికి పూల మాలను సమర్పించి, జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బి.వి.రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఎం.వి.ఎన్.ప్రసాద రావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అజిత్ బాబు, వసతి గృహ సంక్షేమాధికారులు, విజయలక్ష్మి, నాగేశ్వరి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ వేమారెడ్డి

ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సంగం

సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సిఐ వేమారెడ్డి, ఎస్ఐ నాగార్జున రెడ్డి సోమవారం ఆటో ఓనర్లు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఆటోలో ఎక్కితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.


కుట్టు మిషన్‌ను అందజేస్తున్న ఎస్ఐ జమాల్‌ఖాన్

కుట్టు మిషన్ వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో "శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు కుట్టు మిషను వితరణ చేశారు. ప్రవాస భారతీయులు (ఆస్ట్రేలియా) అయిన ఫణీంద్ర నాగుబండి, వారి సతీమణి అఖిలేశ్వరి సహకారంతో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు కుట్టు మిషను సోమవారం ఒకటవ పట్టణ ఎస్ఐ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.జమాల్ ఖాన్ మాట్లాడుతూ జీవనోపాధి పొందేందుకు కుట్టు మిషన్లు ఎంతో ఉపయోగపడతాయని, ఆ బాటలో వారికి ఉచితంగా శిక్షణ ఇస్తూ, కుట్టు మిషన్లు కూడా అందజేయడంలో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పొన్నగంటి మాధవి సఫలీకృతు రాలు అయిందని అభినందించారు. భవిష్యత్తులో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మాధవి మహిళలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. గత ఆరు సంవత్సరాలుగా దాదాపు వెయ్యి మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాక, దాదాపు 500 మందికి పలువురి సౌజన్యంతో కుట్టు మిషన్లు అందజేశామని తెలిపారు. గతంలో ఫణీంద్ర సహకారంతో కూడా కుట్టు మిషన్లు అందించామని, ఎస్ఐ జమాల్‌ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి పేర్కొన్నారు.

తాగునీరు అందించాలని నిరసన

ప్రజాశక్తి-కావలి

36వ వార్డు చెరువు కట్ట గిరిజన సంఘంలో రెండు నెలల నుంచి తాగునీటి బోరు చెడిపోయి, నీటి సరఫరా లేనందున, తమకు నీరందిచాలని ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బోరు దగ్గర ఖాళీ బిందెలు పెట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ చెరువుకట్ట సంఘంలో 100 కుటుంబాలకు పైబడి నిరుపేదలు నివాసముంటున్నారన్నారు. ఎక్కువమంది ఈ బోరు నుండి వచ్చే మంచి నీటిని తాగి, కాలము గడుపుతున్నారని, ఈ బోరు చెడిపోయి రెండు నెలలు అయినప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేసి నీటి సరఫరా చేయకపోవడం చాలా


సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మహిళలు

విచారకరమైన విషయమన్నారు. ఇక్కడ నివసించే వారందరూ నిత్యం కూలి పనులు చేసుకునే వారని రెండు నెలల నుంచి తాగునీటికి కటకటలాడుతున్నారన్నారు. ఇలాంటి పేదల గోడు పాలకులకు ఎన్నికలైన తరువాత పట్టవా అని ప్రశ్నించారు. గొప్పలు చెప్పుకునే పాలకులు ఇలాంటి సమస్యలు పరిష్కారం చేయకపోవడం చాలా దుర్మార్గమైన విషయం అన్నారు. పేదలు నివసించే ప్రాంతాలలో అధికారులు సమస్యలు పరిష్కరించ లేదనడానికి ఈ సమస్యే ఉదాహరణ అని తెలిపారు. ఇలాంటివి ఇంకా ఉన్నాయని ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకొని ఈ చెడిపోయిన బోరును మరమ్మతులు చేయించి, నీటి సరఫరా చేయించాలన్నారు. ఈ పేదలు నివసించే కాలనీలో కొత్త బోర్లు కూడా వేసి, నీటి కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, స్థానికులు మాలకొండ స్వామి, తిరువీధుల ప్రసాద్, అరుణ, కోటేశ్వరి, రమణమ్మ తోపాటు సంఘం వాసులు పాల్గొన్నారు.

మురుగునీటితో పంట మునక

- డ్రెయినేజీ కాలువలో పూడిక తీయించాలని బాధితుల ఆవేదన

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆలయ భూములు కౌలుకు సాగు చేసుకుంటున్న ఈదూరు విజయమ్మ, ఈదూరు తిరుపతి, పలువురి పొలంలో డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో, ఉన్న కాలువలో పూడిక తీయక పోవడంతో మురుగు నీరు చేతికందిన పంట మీదపడి 3 నెలల నుండి పెంచుకున్న పంటను మురుగు నీట ముంచాయి. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేదని వారు మీడియాతో వాపోయారు. ఈ డ్రెయినేజీ కాలువ నిర్మించకపోతే ఎందరో రైతులు నష్టపోతారని తెలిపారు. సోమవారం కొత్తూరు నాయకులు కైలాసం శ్రీనివాసుల రెడ్డికి తమ సమస్యను అర్జీ రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక బిజెపి నాయకులతో కలిసి పంట నష్టాన్ని


పంటను చూపుతున్న బాధితురాలు

ఆయన పరిశీలించారు. ఈ అనంతరం ఆయన మాట్లాడుతూ కోవూరు ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి దృష్టికి ఈ విషయం తిసుకుని వెళ్తామని తప్పక న్యాయం జరుగుతుందని తెలిపారు. కేతిరెడ్డి అవినాష్ రెడ్డి, నెల్లూరు శ్రీనివాసులు, చేవూరు వెంకట్రావు, ఓసూరు మురళి, వాకాటి ప్రసాద్, మేనాటి రాంబాబు, మేనాటి పవన్, మేనాటి హరికృష్ణ, తువ్వర రాంబాబు, మహేష్, నెల్లూరు వెంకటశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

పొగాకు వేలం ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు బోర్డును సోమవారం పొగాకు బోర్డు ఇన్‌ఛార్జి సెక్రెటరీ డి.వేణుగోపాల్, రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు సోమవారం సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై వచ్చే పంటకాలనికి సంబంధించి పొగాకు పంట నియంత్రణ చేయాల్సిన ఆవశ్యకత గూర్చి వివరించారు. పొగాకు వేలం కేంద్రం పరిధిలో 6.3 మిలియన్ కేజిలకు అనుమతి ఇవ్వగా 10 మిలియన్ల పొగాకును పండించారని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వేలం కేంద్రాలపరిధిలో పొగాకు సాగు ఎక్కువైందన్నారు. ప్రపంచ దేశాలలో కూడా పొగాకు సాగు పెరుగుతుందని, ఈ విధంగా పొగాకు సాగు పెరిగినందు వల్ల ప్రపంచ మార్కెట్‌లో పొగాకు డిమాండ్ తగ్గొచ్చే పంటకాలనికి అధికంగా పొగాకు పండిస్తే తగిన ధరలు పొందలేరన్నారు. పొగాకు బోర్డ్ అనుమతించిన మేరకే పొగాకును సాగు చేసి మంచి ధరలను పొందాలని రీజినల్ మేనేజర్ తెలియజేశారు. పొగాకు బ్యారెన్లు, పొలం అధిక ధరలకు కౌలుకు తీసుకొని పొగాకును పండించడం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 2024-25 పంట కాలనికి పొగాకు బోర్డు అనుమతించిన మేరకే ఒక బ్యారెన్‌కు 3.37 హెక్టార్లు, 4275 కిలోల పొగాకును మంచి నాణ్యతతో పండించాలని సూచించారు. పొగాకు బోర్డ్ పొగాకు రైతులు సంక్షేమానికి అన్ని విధాలా సహాయ పడుతుందని, గత రెండు సంవ్సరాలు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా పరిమితికి మించి పండించిన పొగాకును కూడా అమ్మడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మోటార్‌ను ప్రారంభిస్తున్న దాతలు

గురుకులానికి మోటార్ అందజేత

ప్రజాశక్తి-కావలి

ముసునూరులోని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కొన్ని రోజులుగా రెండు మోటార్లు పనిచేయక మంచినీటి కోసం, వంటకోసం, పిల్లల స్నానాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన బాలికలకు సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర అభ్యర్ధన మేరకు ఒట్టూరు.సుచిర్ జ్ఞాపకార్థంగా వారి తల్లిదండ్రులు ఒట్టూరు సుధాకర్ - చిత్రకల్పన దంపతులు పాఠశాలకు రూ.30వేలు విలువ కలిగిన నూతన మోటార్‌ను అందజేశారు. దాత చిత్రకల్పన చేతుల మీదుగా మోటార్‌ను ప్రారంభోత్సవం చేశారు. ముఖ్య అతిథులుగా కలిగిరి ఎస్ఐ ఒట్టూరు శ్రీనివాసులు - నీరజ దంపతులు, దాత ఒట్టూరు.చిత్రకల్పన, ఆత్మకూరు కల్లయ్య, పాఠశాల కరస్పాండెంట్ జి.సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

123 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ

ప్రజాశక్తి-కావలి

కావలిలో 123 ఎకరాల ప్రభుత్వ భూమిని మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ముఖ్య అనుచరులు ఆక్రమించి, లే-అవుట్‌లు వేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని టిడిపి నాయకులు ఆరోపించారు. సోమవారం కావలి టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, దావులూరి దేవకుమార్, దేవరకొండ శ్రీను మాట్లాడారు. మాజీ ఎంఎల్‌ఎ ముఖ్య అనుచరులు 123 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేసింది నిజం కాదని తేలితే బహిరంగ క్షమాపణకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. జాతీయ జెండాను పరిశీలించడానికి వచ్చిన మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి కనీసం జాతీయ జెండాకు సెల్యూట్ చేయకపోవడం, తిరిగి ఎంఎల్‌ఎపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పైలాన్ కూల్చినచోట పైలానే నిర్మించాలి కదా.. జాతీయ జెండా ఎందుకు.. అని అవమానపరిచిన ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. ఇంటి ముందు రోడ్డు కూడా వేసుకోలేకపోయిన మాజీ ఎంఎల్‌ఎ, ఇప్పుడు మాత్రం అన్ని పనులు వెంటనే పూర్తవాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎంఎల్‌ఎకు సంబంధించిన క్వారీని సీజ్ చేసి, రూ.143 కోట్ల జరిమానా విధిస్తే, అది మీ ప్రభుత్వ హయాంలోనే


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కోర్టు కొట్టి వేయడం జరిగిందని తెలిపారు. పైలాన్ విధ్వంసం చేసిన కేసును తిరిగి ఓపెన్ చేయడం జరిగిందని, త్వరలోనే దోషులను పట్టుకొని జైలుకు పంపటం జరుగుతుందని తెలిపారు. స్వేచ్ఛగా వార్తలు రాస్తున్న విలేకరులపై దాడులు చేసిన సంస్కృతి వైసిపిదని, విలేకరులను బెదిరిస్తే ఊరుకోమని, విలేకరులకు అండగా ఉంటామని, వారిని కాపాడుకుంటామని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కావలి ఎంఎల్‌ఎ దగుమాటి కృష్ణారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని హామీల అమలుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని, సొంత నిధులు వెచ్చించి మరీపనులు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మొగలి కల్లయ్య, రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, డాక్టర్.ఏగూరి చంద్రశేఖర్, అర్షియా బేగం, ఆలా శ్రీను, తోట వెంకటేశ్వర్లు, కావేటి చినకోటయ్య, ఖాదర్‌బాషా, రహీం, కోట రమేష్, ఇగుటూరు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి చేయూత

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల గ్రామ ఎస్‌సి కాలనీకి చెందిన రాచూరి వెంకటయ్య, కృష్ణమ్మ రెండవ కుమార్తె శ్రీవిద్య సోమశిల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆటపాటలు, చదువులో చలాకీగా ఉంటూ చదువుకు దూరమైంది. పేదింటి బిడ్డ ఖరీదైన వ్యాధితో బాధ పడుతుంది. వైద్యానికి లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. స్థోమతలేని ఆ తల్లిదండ్రులు బిడ్డ ప్రాణాలు కాపాడుకునేందుకు దాతల సహాయం వల్ల కొంత డబ్బుతో నెల్లూరులోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చూపించడంతో వైద్యులు పరీక్షలు చేసి ఆ బిడ్డకు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధిగా నిర్ధారణ చేసి వ్యాధిని నయం చేయడానికి లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పారు. వేరే గత్యంతరం లేక చెన్నైలోని ఆసుపత్రిలో చేర్పించారు. తమది పేద కుటుంబమని దాతలు సహకరించి బిడ్డను కాపాడవలసిందిగా పత్రికా ముఖంగా తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా వేడుకున్నారు. సహాయం చేసే వారు లేక ఇంటికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆగ్నేష్ మల్టీ పర్పస్ డెవలప్మెంట్ సొసైటీ వారు వెంటనే స్పందించి ఆ


బాలికను ఆదుకున్న ఆగ్నేస్ స్వచ్ఛంద సంస్థ

బిడ్డను నెల్లూరు ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్‌తో మాట్లాడి బిడ్డకు కావలసిన ఆర్థిక సహాయం తమ ఆగ్నేష్ మల్టీ పర్పస్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా అందిస్తామని సంస్థ అధ్యక్షులు కానగల వెంకట రమణయ్య చెప్పారు. డాక్టర్లు వెంటనే బిడ్డకు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికి చికిత్స ప్రారంభించారు. బిడ్డ ఆరోగ్యంగా ప్రస్తుతం బాగానే ఉంది. ఆర్థిక సహాయం చేసి బిడ్డ ప్రాణాలు కాపాడిన ఆగ్నేష్ సంస్థ వ్యవస్థాపకులు, పెద్దలకు శ్రీ విద్య తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-కలిగిరి

కలిగిరి మండలం కేంద్రంలో నూతన ఎస్ఐగా ఎం.ఉమా శంకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో నేరాలను అదుపులో ఉంచడానికి, తనవంతు కృషి చేస్తానని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, యువకులు చెడు వ్యాసనాలను దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.


మాట్లాడుతున్న ఎంఇఒ ఎస్‌కె మస్తాన్‌వలీ

28వ తేదీ నుంచి పరీక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి

స్వీయ మదింపు, సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు 28 నుండి వచ్చే నెల 4వ తేదీ వరకు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ షేక్.మస్తాన్‌వలీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు సెల్ఫ్ అసిస్టెంట్ స్వీయ మదింపు పరీక్షలను నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలో స్కర్ట్ ఎపి క్రియేట్ వారు జారీచేయబడిన ప్రశ్నా పత్రాలతో మాత్రమే పరీక్షలు నిర్వహించాలన్నారు. 1 నుండి 8 తరగతుల విద్యార్థులకు ఓఎమ్‌ఆర్‌లతో పరీక్షలు నిర్వహించాలని ఓఎమ్‌ఆర్‌లు సిఆర్‌ఎంటిల ద్వారా అన్ని పాఠశాలలకు అందజేయబడతాయన్నారు. 1వ తరగతి నుండి 5 తరగతుల ప్రశ్నాపత్రాలు ఆయా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల నుండి ఏ రోజుకు ఆరోజు ప్రధానోపాధ్యాయులు తీసుకుని వెళ్లాలన్నారు. 6 నుండి 10 తరగతుల ప్రశ్నాపత్రాలు ఎంఇఒ కార్యాలయం నుండి ఏ రోజుకారోజు ప్రధానోపాధ్యాయులు తీసుకుని వెళ్లాలన్నారు. పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు జవాబులతో కూడిన ప్రశ్నాపత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను రిజిస్టర్‌లో నమోదు చేసి నిర్ణీత సమయంలోగా సిఎస్‌సి వెబ్‌సైట్‌లో విద్యార్థి వారీగా మార్కులు నమోదు చేయాలన్నారు. ఓఎమ్ ఆర్‌లను తరగతుల వారీగా అమర్చి ప్యాక్ చేసి 4న ఎంఇఒ కార్యాలయంలో అందజేయాలన్నారు.



సిఐను కలిసిన జనసైనికులు

ప్రజాశక్తి-కావలి

కావలికి కొత్తగా వచ్చిన 1 టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఫిరోజ్‌ను జనసేన జిల్లా కార్యదర్శి, పిఎసి సమ్మను వెంకటసుబ్బయ్య, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కావలి అధ్యక్షులు ఆలా శ్రీనాథ్ గౌరవప్రదంగా సిఐను కలిసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు గుంటుపల్లి కిష్టయ్య, జానీ, జిల్లాని, షమ్మీ, శీను, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల కృష్ణాష్టమి వేడుకలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని యాదవ వీధిలోని శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో సిఐ గంగాధర్ దంపతులు పాల్గొని ఆలయ మూలవిరాట్ వేణుగోపాల స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు సిఐ దంపతులను ఆశీర్వదించారు. వారివెంట స్థానిక కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదగయగిరి : మండలంలో వివిధ ప్రాంతాలలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో శ్రీకృష్ణుని గోపిక వేష ధారణలో చిన్నారులు ఆకర్షణీయంగా నిలిచారు. మండలంలోని కృష్ణారెడ్డిపల్లి కాకు వెంకటయ్య మనవరాలు ఈర్ల నాగ వెంకట సాత్విక, స్థానిక పట్టణంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి కుమారులు శ్రీకృష్ణుని గోపిక వేషధారణలో పట్టణ మండల వాసులను ఆకర్షితులను చేశారు. ముందుగా మండలంలోని కుర్రపల్లి సున్నంవారి చింతల గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ ఆవరణంలో భక్తులు సోమవారం శ్రీకృష్ణుని జన్మదిన సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అలాగే ముందుగా గణపతి పూజ పుణ్యవచనం కలశపూజ అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.




'ఎస్ఎస్‌వి' స్కూల్లో కృష్ణాష్టమి

ప్రజాశక్తి-నెల్లూరు : 11వ డివిజన్ ఎన్‌టిఆర్ నగర్‌లోని శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ స్కూల్లో కృష్ణాష్టమి సందర్భాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలలో ప్రైమరీ, హై స్కూల్ విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులందరూ కృష్ణుడు, రాధా, గోపిక వేషధారణలో వచ్చారు. విద్యార్థులందరికీ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాక చిన్నారి కృష్ణులతో ఉట్టి కొట్టించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్కూల్ చైర్మన్ ఆవుల.శ్రీనివాసులు విచ్చేసి చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి చిన్నారులను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు గీత, ఉమామహేశ్వరి, హరికృష్ణ, హేమలత, కళ్యాణి, సుమ తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అధ్యాపకులకు తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామీణ వైద్యుడికి పురస్కారం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణానికి చెందిన గ్రామీణ వైద్యులు, ఆపద్బాంధవ సేవా ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ దామ మధుసూదన రావుకు సోమవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా విజయవాడలోని గాంధీనగర్ దగ్గర గ్రంథాలయంలో అరుదైన గౌరవం దక్కింది. విజయవాడలోని మదర్ సర్వీస్ సొసైటీ వారి రెండవ వార్షికోత్సవం సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ కావలి పట్టణంలోని పేదలకు, మతిస్థిమితం లేని వారికి ప్రతిరోజూ అన్నదానం చేస్తున్నందుకు గానూ తాను చేసిన సేవలు గుర్తించి, ఎంపిక చేసిన మదర్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ మల్లాది ప్రసాద్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అవార్డు గ్రహీతకు మదర్ థెరిస్సా పురస్కారం అందించి దుస్సాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.



లక్ష్మానందాకు జాతీయ సేవా పురస్కారం

ప్రజాశక్తి-కావలి

కావలి డివిజన్‌లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ రక్తదాన చైతన్యకర్త, లైవ్స్‌బ్లడ్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ - కావలి శాఖ సర్వ్ కన్వీనర్‌గా సామాజిక సేవ చేస్తున్న బీద లక్ష్మానందాకు విజయవాడకు చెందిన మదర్ సర్వీసెస్ సొసైటీ రెండో వార్షికోత్సవ సందర్భంగా సోమవారం అక్కినేని నాగేశ్వరరావు కళా కేంద్రంలో జాతీయ సేవా పురస్కారం సంస్థ అధ్యక్షులు మల్లాది ప్రసాద్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఈ జాతీయ సేవా పురస్కారం అనేది తనకు తోడ్పాటు అందించిన ప్రతిఒక్క సేవా బృందంలోని సభ్యుడికి, రెడ్‌క్రాస్ సభ్యులకు చెందుతుందని తెలిపారు. ఈ సేవా పురస్కారం తనపై సమాజం గురించి మరింత బాధ్యతలను పెంచుతుందన్నారు. ఈ సందర్భంగా తన సేవలు గుర్తించిన విజయవాడ మదర్ సర్వీస్ సొసైటీ సభ్యులకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

